క్లుప్తంగా

గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సతీమణి మృతి


గరిమెళ్ల రాధ (ఫైల్)

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆస్థాన విద్వాంసుడు దివంగత గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సతీమణి గరిమెళ్ల రాధ అనారోగ్యంతో భవానగర్‌లోని వారి స్వగృహంలో ఆదివారం ఉదయం 8.15 గంటలకు మృతి చెందారు. ఆమె భర్త గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ గత మూడు నెలల క్రితం వైకుంఠ ప్రాప్తి చెందిన విషయం విదితమే. కాగా ఆమె దహన క్రియలు ఈనెల 11వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు గోవింద దామం వద్ద నిర్వహించనున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

స్పర్శ హాస్పిటల్ ప్రారంభం


హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న అధినేతలు

తిరుపతి కల్చరల్: నగరంలోని రెడ్డిరెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పర్శ హాస్పిటల్ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేతలు డాక్టర్ హరిబాబు, డాక్టర్ జీవన్‌కుమార్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ రాణాప్రతాప్, డాక్టర్ భరత్ కత్తి మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలతో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులతో తమ హాస్పిటల్లో అనేక విభాగాలలో అత్యుత్తమ వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఆధునాతన వైద్య సేవలను అందుబాటు ధరల్లోనే అందిస్తామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ శిరీషతో పాటు వివిధ హాస్పిటల్స్ అధినేతలు, ప్రముఖ వైద్యులు హాజరయ్యారు.

రేపు విశ్వంలో ఉచిత అవగాహన సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో సోమవారం ఉదయం 10 గంటలకు సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలపై ఉచితంగా అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు 4 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

వైభవం.. సాంస్కృతిక సంబరం


నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నైకి చెందిన శక్తిలయ నాట్యపల్లి ఆధ్వర్యంలో నాట్యాచార్యులు సతియ ఆనంద రెడ్డి పర్యవేక్షణలో శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. వారి అభినయానికి మంత్రముగ్ధులైన ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికుల కుటుంబాల కోసం క్రెడాయ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్‌ప్రసాద్ 2005 నుంచి 2020 వరకు ఉచితంగా జీవకోనలో ప్రాథమికోన్నత పాఠశాల నిర్వహించారు.

ఇక్కడ విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ప్రస్తుతం సాఫ్ట్‌వేర్, స్టాక్ మార్కెట్ రంగాల్లో స్థిరపడగా, మరికొందరు ఇంజినీరింగ్, డీఫార్మసీ చదువుతున్న 35 మంది విద్యార్థులు ఆదివారం జీవకోనలోని గురుకృప విద్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, ఒకరినొకరు యోగక్షేమాలను తెలుసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా క్రెడాయ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన పేద విద్యార్థులు ఉన్నతస్థాయిలో స్థిరపడడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు, నాటి హెచ్‌ఎం తోసంగి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుందరీకరణ.. జరిగేనా ?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. నగర శివార్ల నుంచి నగరంలోని కనెక్టివిటీ పెంచుతూ రోడ్లు నిర్మించారు. దీనికితోడు శ్రీనివాస సేతు వంతెన నిర్మాణం సైతం గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయింది. అలాగే నగర పరిధిలో 8 చెరువులు ఉండగా..కొరమీనుగుంట చెరువును సుందరంగా తీర్చిదిద్దారు. అయితే ఎన్నికలు రావడం.. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లా అధికారులు ఇంతవరకు పదిసార్లు సమావేశాలు నిర్వహించినా.. ఒక్క చెరువునూ సుందరీకరణ చేపట్టకపోవడంగమనార్హం.

- తిరుపతి అర్బన్ పరిధిలో 8 చెరువులు
- గత వైఎస్సార్‌సీపీ పాలనలో కొరమేను గుంట చెరువు బ్యూటిఫికేషన్
- కూటమి సర్కారులో ఒక్క చెరువునూ పట్టించుకోని వైనం
- చెరువుల సుందరీకరణపై ఇప్పటికే పదిసార్లు సమావేశమైన జిల్లా అధికారులు


గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చెందిన కొరమేనిగుంట చెరువు

తిరుపతి అర్బన్: తిరుపతి నగరం జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి గత ప్రభుత్వ హయాంలో శరవేగంగా అభివృద్ధి పరుగులు పెట్టింది. రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా.. నగరం విస్తరిస్తున్న తరుణంలో గత ప్రభుత్వంలో మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి చొరవతో ఎంతో అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక అసలు నగర అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఈ క్రమంలో నగరంలోని ఐదు పార్కుల్లో నగరవాసులు కుటుంబ సభ్యులతో వెళ్లి గడపడానికి ప్రత్యేక రుసుం చెల్లించాల్సి ఉంది. దీంతో కొందరికే పార్కులు పరిమితం అవుతున్నాయి. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుపతి అర్బన్ పరిధిలోని కొరమేనుగుంట, పూలవానిగుంట, గొల్లవానిగుంట, మంగళం చెరువు, శెట్టిపల్లి చెరువు, అన్న చెరువు, చెన్నాయిగుంట, పాన్ చెరువులను అత్యంత సుందరీకరణగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు.

సమావేశాలు సరే కానీ..

ఆ మేరకు ఈ అంశంపై జిల్లా కలెక్టరేట్‌లో, తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా పెద్ద అధికారులు పలుసార్లు సమావేశాలు నిర్వహించారు. అయితే ఈ ఎనిమిది చెరువుల్లో ఒక్క చెరువు సుందరీకరణకు ఇప్పటివరకు ఈ ఏడాది సమయంలో చిన్నపాటి పనులు చేపట్టిన సందర్భాలు లేవు. బ్యూటిఫికేషన్ పనులు చేపడితే నగర వాసులు విశ్రాంతి సమయంలో సేదతీరడం కోసమే కాకుండా వాకింగ్‌కు వీలుగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అయితే ప్రయోజనం మాత్రం శూన్యంగానే చెప్పవచ్చు. గత వైఎస్సార్‌సీపీ సర్కార్‌లో కొరమేనుగుంట చెరువును వాకర్స్‌కు వీలుగా తీర్చిదిద్దారు. దీంతో కొరమేనుగుంట వద్ద ఉదయం 400 మంది, సాయంత్రం 300 మంది వాకర్స్ గత ప్రభుత్వం అభివృద్ధి చేయడంతో సద్వినియోగం చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని సక్రమంగా నెరవేర్చని సంగతి తెలిసిందే. అయితే కొందరు అధికారులు సైతం అప్పుడప్పుడు పనులు పూర్తి చేసేలా సమావేశాలు నిర్వహించడం.. ఆ తర్వాత ఆ అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టేస్తున్నారు. దీనిపై నగర వాసుల నుంచి పెద్దఎత్తునే విమర్శలు చేస్తున్నారు. ఆశలు కల్పించడం ఎందుకు.. ఆ తర్వాత పట్టించుకోకుండా ఉండడం ఏంటీ అంటూ పలువురు బాహాటంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

చంద్రగిరి: ఆధునిక శాస్త్రీయతతో ద్వారా వ్యవసాయం మరింత సులభంగా నిర్వహించవచ్చని రాస్ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధాకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్పం అభియాన కార్యక్రమంపై ఆదివారం రైతులకు మండల పరిధిలోని ఎం.కొంగరవారిపల్లి, ఐతేపల్లిలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో ఆధునిక శాస్త్రీయతపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందులో భాగంగా పంట ఉత్పత్తి, నేల ఆరోగ్యం, వనరుల నిర్వహణను మెరుగు పరచడంపై రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా భూసార పరీక్ష ఫలితాలు అనుసరించి ఎరువులు వినియోగించుకోవాలన్నారు. ఇష్టానుసారం భూమికి ఎరువులు వేస్తే పంట దిగుబడులకు నష్టం తప్పదని సూచించారు. డ్రోన్ వాడకం, వాటి ఉపయోగాలు గూర్చి తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గూర్చి వివరించారు. మరో శాస్త్రవేత్త భరత్ కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే నాణ్యమైన విత్తనం వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమవుతుందని తెలిపారు. సబ్సిడీ అందుబాటులో ఉన్న పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శశిధర్ రెడ్డి, ఉద్యాన సహాయకురాలు పవిత్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్‌లో కార్పొరేట్ల ప్రభంజనం

నారాయణ విజయకేతనం


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డీజీఎం కొండలరావు


ఉత్తమ ర్యాంకులు సాధించిన శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో తిరుపతిలోని కార్పొరేట్ కళాశాలలు తమ హవా కొనసాగించాయి. అందులో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఇంజినీరింగ్ విభాగంలో ఎం.భానుచరణ్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు, మణిదీప్‌రెడ్డి 7, ధనుష్ 59, యశ్విత 69వ ర్యాంకులతో వందలోపు నాలుగు ర్యాంకులు సాధించారు. అలాగే బైపీసీ విభాగంలో మౌనిక 94వ ర్యాంకుతో పాటు వెయ్యిలోపు 9మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యాసంస్థ డీజీఎం కొండలరావు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ సురేష్, అధ్యాపకులు అభినందించారు.

శ్రీధర్ అకాడమీ ప్రతిభ..

నగరంలోని ఏఐఆర్ బైపాస్‌రోడ్డులోని శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు ఏపీఈఏపీసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటినట్లు ఆ కళాశాల చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాల్లో వి.మోహిష్ 228వ ర్యాంకు, కె.సాయిపార్థీవ్ 737, పి.నిఖిలేశ్వర్ 1365, ఎస్.పెన్నిధి 3919, వి.అమృత 4414వ ర్యాంకు సాధించారన్నారు. పరీక్షకు హాజరైన 110 మంది విద్యార్థుల్లో 10 వేల ర్యాంకులోపు 25 మంది సాధించినట్లు తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులను అభినందించారు.

శ్రీచైతన్య విజయభేరి

తిరుపతిలోని శ్రీచైతన్య విద్యాసంస్థ విద్యార్థులు ఏపీఈఏపీ సెట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయభేరి మోగించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాల్లో ఓ.ఆరుష్ లక్ష్మణ్ 45వ ర్యాంకు, వి.యశ్వంత్ 135, డి.లావణ్య 230, లక్ష్మీ సహస్ర 322, ఎ.జస్విత 398, కె.జస్విత 444, వై.శివకృతిక్ 492, హర్షవర్ధన్ 528, ఎం.ఉమేష్ 551, ఎం.హిమవర్ష 787, సి.రామలక్ష్మమ్మ 799, వి.లక్ష్మీహర్షిత 800, కె.మంజునాథ మహర్షి 900, కె.టీనారాణి 919, వి.సాధన 925వ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు ఆ విద్యాసంస్థ ఏజీఎం బీవీ.ప్రసాద్ తెలిపారు. ఆ విద్యార్థులను డీన్లు కెఎల్‌జీ ప్రసాద్, మోహన్‌రావు, శ్రీనివాసరాజు, భాస్కర్ తదితరులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థ ఏజీఎం, డీన్లు

తెప్పపై సుందరరాజస్వామి విహారం


శ్రీదేవి, భూదేవి సమేతంగా పద్మసరోవరంలో తెప్పపై విహరిస్తున్న సుందరరాజ స్వామివారు,

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన ఆదివారం సాయంత్రం పుష్కరిణిలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీసుందరరాజస్వామి తెప్పపై విహరిస్తూ భక్తులకు దివ్యానుగ్రహం ప్రసాదించారు. మధ్యాహ్నం 3గంటలకు ఉభయదేవేరులతో కలిసి స్వామివారిని సన్నిధి ముఖమండపానికి తీసుకొచ్చారు. అనంతరం వేదపారాయణం, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు సర్వాంగ శోభితుడైన స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతంగా తెప్పపై కొలువై మూడు పర్యాయాలు పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం స్వామివారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమాల్లో ఆలయ డెప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏవీఎస్‌ఓ సతీష్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్లు రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవాల్లో నేడు..

తెప్పోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు పుష్కరిణి మధ్యలో ఉన్న నీరాడ మండపంలో శ్రీపద్మావతి అమ్మవారికి అభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు తెప్పోత్సవం, రాత్రి 7.30 గంటలకు తిరుచ్చి ఉత్సవం జరుగుతుంది.

పలువురికి నివాళులు


చెర్లోపల్లి వాసుదేవనాయుడును పరామర్శిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ విప్పర్ల రెడ్డెప్ప నాయుడుకు రాజకీయ పార్టీలకు అతీతంగా పార్టీ నేతలు హాజరై నివాళులు అర్పించారు. ఆదివారం ఆయన ఇంటి వద్ద జరిగిన కర్మక్రియలకు హాజరైన నేతలు కుటుంబ సభ్యులను ఓదార్చి పెద్దాయన చేసిన మంచిని గుర్తు చేసుకున్నారు. చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కర్మక్రియలకు హాజరై సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం రెడ్డెప్పనాయుడు కుమారులు వాసుదేవనాయుడు, రమేష్‌నాయుడును కలసి ధైర్యం చెప్పారు. చెర్లోపల్లి సర్పంచ్ బొల్లినేని సుభాషిణి, శుభగిరినాయుడు గ్రామస్తులతో కలసి ఆ ఇంటికి చేరుకుని నివాళులు అర్పించారు. తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి, బడి వెంకటేష్‌యాదవ్‌లతో పాటు టీడీపీకి చెందిన కొల్లూరి ఇందుశేఖర్, బడి సుధాయదవ్, చంద్రగిరి మండలం నుంచి సుబ్రమణ్యం నాయుడు, గౌస్‌బాషాలతో పాటు స్థానిక నేతలు రెడ్డెప్ప నాయుడు చిత్రపటానికి నివాళులు అర్పించారు.

పలకరింపులు.. పరామర్శలు..

తిరుపతి రూరల్/పాకాల : పాకాల మండలం కొత్త వడ్డిపల్లి పంచాయతీ గుడార్లబండ గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నేత లింగయ్య సోదరుడు దాము ఇంట జరిగిన కర్మక్రియలకు హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతకుముందు దాము కుమార్తె జ్యోత్స్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పర్యటనలో మోహిత్ రెడ్డి వెంట ఎంపీపీ లోకనాథం, మండల పార్టీ అధ్యక్షుడు నంగా నరేష్‌రెడ్డి, కపిలేశ్వర రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రామచంద్రాపురం మండలం సొరకాయలపాళెంకు చెందిన పార్టీ నేత ముక్కోటి తండ్రి సుబ్బయ్య కర్మక్రియలకు వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, మండల పార్టీ పరిశీలకులు నల్లందుల సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు.


గుడార్లబండ గ్రామంలో జ్యోత్స్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


సొరకాయలపాళెంలో సిద్దయ్య కర్మక్రియలకు హాజరైన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రప్రభపై గోవిందుడి వైభవం


చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్న శ్రీగోవిందరాజస్వామి


వెన్నకృష్ణుడి అలంకరణలో దర్శనమిస్తున్న గోవిందరాజస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన ఆదివారం రాత్రి చంద్రప్రభ వాహనంపై వెన్నకృష్ణుడి అలంకరణలో కొలువై ఊరేగుతూ శ్రీగోవిందరాజస్వామి భక్తులను కనువిందు చేశారు. మంగళవాయిద్యాలు, భక్తజన బృందాల కోలాటాలు, భజనల మధ్య స్వామివారి చంద్రప్రభ వాహన సేవ కోలాహలంగా సాగింది. దీనికి ముందు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారు సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఎఫ్‌ఏఅండ్ సీఏఓ బాలాజీ, డెప్యూటీ ఈఓ వీఆర్ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, పలువురు శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం : బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరుగనుంది. ఉదయం 6.15 గంటల నుంచి రథంపై స్వామివారు కొలువై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తారు. అలాగే రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు.

చదరంగంతో మానసిక ఎదుగుదల



మాట్లాడుతున్న విక్రమ్‌కుమార్

తిరుపతి కల్చరల్: చదరంగం మనిషి ఏకాగ్రతను పెంచుతుందని, విద్యార్థుల మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ జె.విక్రమ్‌కుమార్‌రెడ్డి, టీటీడీ డీఈఓ వెంకట సునీల్ తెలిపారు. వేమన విజ్ఞాన కేంద్రం, తిరుపతి చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడాకారులు చెస్‌తో పాటు యోగాను కూడా సాధన చేస్తే అద్భుత విజయాలు సాధించవచ్చన్నారు. అనంతరం ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించారు. సుమారు 186 మంది అన్ని వయసుల వారు పాల్గొని చెస్ ఆడారు. అనంతరం విజేతలకు విజయభారతి ఆటో మొబైల్స్ రోటేరియన్ మట్టా పురుషోత్తం ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, అంకమనాయుడు, డాక్టర్ జాలేశ్వరరావు, టెంకాలయ దామోదరం, సుంకరం రెడ్డెప్ప, పి.ముఖేష్, నారాయణ, ఎస్‌ఏ రఫీ, మునిరాజు, డాక్టర్ రవీంద్ర, వినయలత, ఇమామ్, వెంకటరమణ, అమరేశ్వరి పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 6.15 గంటలకు స్వామి వారి రథోత్సవం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు అశ్వవాహన సేవ
- జిల్లాలోని పలు కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 10.30 వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు మూడు సెషన్లలో ఏపీ పీజీ సెట్ పరీక్షలు ప్రారంభం
- జిల్లాలోని 8 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు
- జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపునకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన
- పుదిపట్ల రామకృష్ణ మందిరంలో ఏడు రోజుల పాటు జరుగనున్న శ్రీమద్భాగవత సప్తాహం సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభం
- అప్పలాయగుంటలో శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం సింహవాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహన సేవ

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న బాధితుడు శంకర్

తిరుపతి కల్చరల్: తమకు పిత్రార్జితంగా లభించిన భూమిని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని అగ్రహారానికి చెందిన జి.శంకర్ విజ్ఞప్తి చేశా రు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేరూరు లెక్కదాఖలా సర్వేనంబర్ 529/4 ఏలో 92 సెంట్ల భూమి 1962లో తన తండ్రి జి.యర్రయ్య పేరిట డీకేటీ పట్టా మంజూరు చేయ డం జరిగిందన్నారు. ఇప్పటికీ ఆ భూమి తమ ఆధీనంలోనే ఉందన్నారు. అయితే శనివారం నాగరాజు, సుబ్రమణ్యం నాయుడు, వెంకటేష్‌తో పాటు మరి కొంతమంది అధికార పార్టీ నేతల అండతో దౌర్జన్యంగా తమ భూమిలోకి ప్రవేశించి నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. విషయం తెలిసి తాము భూమి వద్ద కు వెళ్లి ఆక్రమణదారులను ప్రశ్నించినా పట్టించుకోలేదన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి ప్రశ్నించి భూమికి సంబంధించిన పత్రాలు చెప్పాలని చెప్పి నిర్మాణాలు ఆపేయించారన్నారు. తనతో పాటు ఆక్రమణదారులను భూమికి సంబంధించిన పత్రాలను తీసుకురావాలని పోలీసులు సూచించారని తెలిపారు. తాను పత్రాలు తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా వారు రాలేదన్నా రు. మళ్లీ ఆదివారం ఉదయం తమ భూమిలో నిర్మాణపనులు చేపట్టేందుకు ప్రయత్నించారని వాపోయారు. రాజకీయ అండతో తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న ఆక్రమణ దారుల పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గరుడ వారధిపై వసూళ్ల దందా

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక ప్రాంతమైన తిరుపతి నగరంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తెలిసిందే. దీంతో గత వైఎస్సార్‌సీపీ సర్కార్‌లో శ్రీనివాస వారధి పేరుతో నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు వాహనదారులకు అందుబాటులోకి వారధిని తీసుకొచ్చారు. దీంతో ప్రధానంగా లక్ష్మీపురం సర్కిర్, ఆర్టీసీ బస్టాండ్, లీలామహల్ సర్కిల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తప్పింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గరుడ వారధిగా పేరు మార్పు చేశారు. అయితే ఆర్టీసీ బస్టాండ్‌లోకి పొరబాటున వారధిపై నుంచి కార్లు, ఇతర వాహనాలు వెళ్తే వారికి ఇష్టారాజ్యంగా జరిమానా విధిస్తున్నారు. బిల్లుపై చూపించేది రూ.50, వసూలు చేసేది మాత్రం రూ.100 నుంచి రూ.200 వరకు ఉందని పెద్దఎత్తున విమర్శలు ఉన్నాయి. అయితే వారధిపై నుంచి బస్టాండ్‌లోకి వచ్చే వాహనాలపై దృష్టి పెడుతున్న ఆర్టీసీ సిబ్బంది.. బస్టాండ్‌లో నుంచి ట్రాఫిక్ రూల్స్‌కు విరుద్ధంగా ఎదురుగా వెళ్తున్న వాహనాలను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. బస్టాండ్‌లోకి వెళ్లే సమయంలో వారధిపై నుంచి దిగే ఆర్టీసీ సర్వీసులకు ఎదురుగా వాహనాలు రావడంతో ప్రతి రోజూ తృటిలో ప్రమాదాలు తప్పుతున్నాయి. దీంతో ఆర్టీసీ డ్రైవర్లు సైతం టెన్షన్ పడుతున్నారు.

